నినాదం
తెలంగాణ ప్రాంతీయం
నిఖార్సైన జర్నలిజం
సోమవారం, తెలంగాణ
8 సెప్టెంబర్ 2025


# విద్యార్థులను సన్మార్గంలో.. నడిపించే బాధ్యత ఉపాధ్యాయులది

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు సత్కారం



**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 7 (నినాదం):** సమాజంలోని ప్రతి విద్యార్థిని క్రమశిక్షణతో కూడిన దేశ భవిష్యత్తును కీర్తి ప్రతిష్టలను ప్రపంచ నలుమూలల వ్యాప్తి చెందే విధంగా ఆధ్వర్యంలో తీర్చిదిద్దే పవిత్ర వృత్తి ఉపాధ్యాయ వృత్తే నని, అలాంటి ఉపాధ్యాయులను సత్కరించడం తమకు దక్కిన అపూర్వ గౌరవమని లయన్స్ క్లబ్ 320 బి డిస్టిక్ గవర్నర్ లయన్ సెల్వ సాయిరాం రాజు అన్నారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని లయన్స్ క్లబ్ సభ్యులుగా ఉన్న 25 మంది ఉపాధ్యాయులను లయన్స్ భవన్ లో జరిగిన కార్యక్రమంలో సత్కరించారు. ఈ సందర్భంగా వారికి మెమెంటోలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో విద్యార్థుల తల్లిదండ్రుల ధోరణిలు ఆందోళనకు గురిచేస్తున్నాయన్నారు. గతంలో విద్యార్థులను అన్ని విధాలుగా తీర్చిదిద్దేందుకు గురువులకు బాధ్యతతో పాటు, అవసరమైతే దండించేవారని తన చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. విద్యార్థులను సన్మార్గంలో పెట్టుటకు ఉత్తమ విద్యార్థులుగా మార్చడంలో నేడు పిల్లలను ఏమాత్రం దండించినా తల్లిదండ్రులు ఉపాధ్యాయులపై ఆగ్రహాన్ని వ్యక్తం చేయడం ఆందోళన కలిగించే విషయం అన్నారు. విద్యార్థులను సన్మార్గంలో నడిపించే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్న విషయాన్ని అందరూ గుర్తిస్తే మంచిదని హితవు పలికారు. లయన్ దీపక్ బట్టాచార్య మాట్లాడుతూ గురువుల స్థానం ఎప్పుడు గౌరవప్రదంగా మొదటి స్థానంలోనే లభిస్తుందని అభిప్రాయపడ్డారు. డిస్టిక్ కౌన్సిల్ లయన్ వినోద్ జాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ లయన్స్ క్లబ్ ల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఇన్చార్జి మంత్రి శ్రీధర్ బాబుకు డివిజన్ల సమస్యలను తెలిపిన సిద్ధనోళ్ల సంజీవరెడ్డి



**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 7 (నినాదం) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం డివిజన్ చెందిన కాంగ్రెస్ పార్టీ నేతలు సిద్ధనోళ్ల సంజీవరెడ్డి తదితరులు మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఇంచార్జ్ మంత్రి, ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు ను మర్యాదపూర్వకంగా కలిసి డివిజన్ల సమస్యలపై వివరంగా చర్చించారు.

## లంబోదరుని లడ్డు దక్కడం మా పూర్వజన్మ సుకృతం

### జెఎంసి మాజీ మేయర్ శాంతి కోటేష్ గౌడ్





**జవహర్‌నగర్ సెప్టెంబర్ 7 (నినాదం):** వేలం పాటలో లంబోదరుని ప్రీతికరమైన లడ్డు మాకు దక్కడం మా పూర్వజన్మ సుకృతం అని జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ శాంతి కోటేష్ గౌడ్ పేర్కొన్నారు. జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 12వ డివిజన్ శ్రీరామ్ నగర్ కాలనీ పోచమ్మ గుడి వద్దనున్న గణేష్ మండప నిర్వాహకులు ప్రతిష్టించిన వినాయక మండపంలో ఆదివారం వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు వేలంపాట నిర్వహించగా మాజీ మేయర్ శాంతి కోటేష్ గౌడ్ రూ. 53, 600 రూపాయలకు లడ్డూను దక్కించుకున్నారు. ఈ సందర్భంగా శాంతి కోటేష్ గౌడ్ మాట్లాడుతూ లడ్డు వేలం పాటలో విఘ్న వినాయకుని ప్రసాదాన్ని దక్కించుకోవడం మా పూర్వజన్మ సుకృతం అని ఆ అదృష్టం మాకు దక్కడం మహదా నందదాయకమన్నారు. పార్వతీ తనయుని ఆశీర్వచనాలు దీవెనలు జవహర్ నగర్ ప్రజల అందరిపై ఉండాలని ఆకాంక్షించారు. భక్తి భావంతోనే ఎటువంటి మంచి కార్యక్రమాలు అయినా చేపట్టవచ్చునని తద్వారా ప్రజలకు సేవ చేసే భాగ్యాన్ని కలిగించినందుకు జవహర్ నగర్ ప్రజలకు రుణపడి ఉన్నానని తెలిపారు. ఆ విగ్నేశిని చల్లని దీవెనల వల్లే పాలన సజావుగా సాగించానని ఆ దేవదేవుని కృప అందరిపై ఉండి జవహర్ నగర్ ప్రజలు సుఖశాంతులతో వర్ధిల్లాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కోటేష్ గౌడ్, శ్రీరామ్ నగర్ కాలనీవాసులు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో గణేశ్వరుడిని పూజించాలి



**మహేశ్వరం సెప్టెంబర్ 7 (నినాదం) :** కల్వకుర్తి నియోజకవర్గం కడ్తాల్ మండలం మైసిగండి డివిజన్ పరిధిలోని చౌహాన్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, ఏర్పాటు చేసిన గణనాథుని నిమజ్జన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మైసిగంటి గ్రామపంచాయతీ పరిధిలోని ఎల్లమ్మ తండా పార్టీ సీనియర్ నాయకులు సభావట్ మల్లేష్ కుమారులు భక్తులందరూ భక్తిశ్రద్ధలతో స్వామివారిని వారు కుటుంబ సమేతంగా హాజరు అయ్యి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి వారి లడ్డు వేలం పాటలో భక్తులు సభావట్ మల్లేష్ కుమారులు సాయి, పాపాలి రూ.23,000 వేల కు దక్కించుకున్నారు. గణేష్ లడ్డూ దక్కించుకున్న దంపతులకు శాలువతో ఘనంగా సత్కరిస్తూ, లడ్డు ప్రసాదంతో వినాయకుడి మండపం నుండి అతని నివాసం వరకు డప్పు వాయిద్యాల నడమ ఊరేగింపు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆ దేవదేవుడు గణనాథుని లడ్డు ప్రసాదం దక్కించుకోవడం చాలా సంతోషకారంగావుందని అలాగే ఆ గణనాథుడి దీవెనలు ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని అందరు సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యలతో, వుండేలా దీవించమనిస్వామి వారిని వెడుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్దలు ప్రధానార్చకులు అభిమానులు పోలీసు సిబ్బందులు బంధువులు మిత్రులు, స్నేహితులు, తదితరులు పాల్గొన్నారు.

## గీతానగర్ పార్కులో.. స్వచ్ఛ కార్యక్రమం





**మేడ్చల్ మల్కాజిగిరి ప్రతినిధి, సెప్టెంబర్7,(నినాదం):** మల్కాజిగిరి మౌలాలి డివిజన్ సర్కిల్ గీతానగర్ వాకర్స్ సభ్యులు వారు చేస్తున్న సేవాకార్యక్రంలో బాగంగా ఆదివారం స్వచ్ఛ కార్యక్రమం నిర్వహించారు. పార్క్ చుట్టూ పేరుకుపోయిన చెత్తను తొలగించారు. కాలనీ రోడ్ల వెంట, పార్కులో చెత్త వేయకూడదని స్వచ్ఛత అందరి బాద్యత గా ఉండాలని ఈ సభ్యులు వాకర్స్ సభ్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కె వి పవన్, అంకమ రావు, పవన్, చక్రధర్, రమేష్, కృష్ణ కుమార్, సుబ్బారావు, డి ఎస్ ఎన్, మూర్తి, శ్రీనివాస రావు, కృష్ణ మూర్తి, తేజో చంద్ర, రామారావు, వేణుగోపాల్ రెడ్డి, బీరప్ప, లవకుమార్, రాజు గౌడ్, కృష్ణయ్య, శ్రీనివాసులు, ఆంజనేయులు, నాగభూషణ్ తదితరులు పాల్గొన్నారు.

## పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేయాలి

- పాత పెన్షన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు మాడవేడి వినోద్ కుమార్



**నిజామాబాద్ ప్రతినిధి, సెప్టెంబర్ 7 (నినాదం) :** పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేయాలని కోరుతూ పిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ని ఆయన స్వగృహంలో 2003 ఉద్యోగ, ఉపాధ్యాయ పాత పెన్షన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు మాడవేడి వినోద్ కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం ఆయన నివాసంలో కలిసారు. 2003 ఉద్యోగ, ఉపాధ్యాయులకు కేంద్ర ప్రభుత్వ మెమో 57 ఆధారంగా ,ఇటీవల హై కోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని వినతి పత్రం అందజేశారు. దీనిపై మహేష్ కుమార్ గౌడ్ సానుకూలంగా స్పందిస్తూ న్యాయమైన డిమాండ్ అని ఖచ్చితంగా సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 2003 పాత పోరాట సమితి నాయకులు అర్గుల సత్యం, సురేందర్, స్వప్న, విజయ్ కుమార్, రామకృష్ణ,గుత్ప ప్రసాద్,గంగాధర్,విట్టల్,మోహన్, మురళి,మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## 1,00,116కు లడ్డును కైవసం చేసుకున్న ఎన్ఆర్ఐ కౌడప్ శత్రుత్ పటేల్



**నిజామాబాద్ ప్రతినిధి, సెప్టెంబర్ 7 (నినాదం) :** తొమ్మిది రోజుల పాటు లాంభోదరుని వద్ద పూజలందుకున్న లడ్డును రూ.1,00,116కు ఎన్ ఆర్ ఐ కౌడప్ శత్రుత్ పటేల్ కైవసం చేసుకున్నారు. శనివారం నగరంలోని నాందేవ్ వాడలోని శివపుత్ర గణేష్ మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేషుడి వద్ద లడ్డుకు వేలం పాట వేశారు. ఈ వేలంలో భారీ ధరకు రూ.1,00,116కు ఎన్ ఆర్ ఐ కౌడప్ శత్రుత్ పటేల్ సొంతం చేసుకున్నాడు. నిజామాబాద్ కు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు కౌడప్ శరత్ పటేల్,ఉమా దంపతుల కుమారుడు కౌడప్ శత్రుత్ పటేల్ గణపతి లడ్డు సొంతం చేసుకున్నాడు. విదేశాల్లో ఉంటూ తమ దేశంలో జరిగే అతి పెద్ద పండుగ అయినా గణనాధుపై భక్తితో లడ్డును వేలంలో కొనుగోలు చేయడం పట్ల స్థానిక ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.కొనుగోలు చేసిన లడ్డును తమ బంధువులతో పాటు తాను స్థిరపడిన అమెరికాలోని తన స్నేహితులకు పంచుతానని కౌడప్ శత్రుత్ పటేల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో శివపుత్ర యూత్ నిర్వాహకులు కందికంటి నరేందర్ గౌడ్, కిషోర్ గౌడ్, సుధీర్ గౌడ్, శ్యామ్ గౌడ్, బింగి శుభం, బబిత్ గౌడ్, రాహుల్ బాసరి, కిరణ్ గౌడ్, సాయినాథ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## భవన కార్మికుల వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి

- ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీలకు వెల్ఫేర్ బోర్డును అప్పజెప్పడం కార్మికులకు తీరని నష్టం
- బిఎన్ఆర్‌కేస్ రాష్ట్ర అధ్యక్షులు కామల్ల ఐలయ్య



**మేడ్చల్ మల్కాజిగిరి ప్రతినిధి సెప్టెంబర్7 (నినాదం):** భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం ఓల్డ్ సఫిల్ గుడా భరత్ నగర్ రాష్ట్ర కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశంలో భవన నిర్మాణ కార్మికులకు తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష్యుడు కామల్ల ఐలయ్య మాట్లాడుతూ ప్రభుత్వం సంక్షేమ పథకాలను పెంచినందుకు హర్షం వ్యక్తం చేస్తున్నాం అన్నారు. కానీ ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీలకు వెల్ఫేర్ బోర్డును అప్పజెప్పడం వల్ల కార్మికులకు తీరని నష్టం జరుగుతుందని ఐలయ్య అన్నారు గత 20 సంవత్సరాల నుండి బిఎన్ ర్ కే స్ అనేక పోరాటాల ఫలితంగా 1996 చట్టం వచ్చింది. ఈ సంక్షేమ పథకాలు కార్మికులకు మాత్రమే ఖర్చు చేయాలి. అట్లకాకుండా కార్మికుడు కాని వారికి సభ్యత్వాలు ఇచ్చి అసలైన కార్మికులకు తీరం నష్టం చేస్తున్నారని డూప్లికేట్ ఐడి కార్డులే కాకుండా ఇప్పుడు వెల్ఫేర్ బోర్డులో స్కీములన్ని ప్రైవేటు పరం చేయడ జరుగుతుందని ఆయన గుర్తు చేశారు కాంగ్రెస్ ప్రభుత్వం ఇదే వైఖరి అవలంబిస్తే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేసి కార్మికుల హక్కులు సాధించుకుంటామని గ్రామాలైన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉప్పు సాయికుమార్, రాష్ట్ర కోశాధికారి తాటికొండ మధు, రాష్ట్ర ఉపాధ్యక్షులు మొరుగు యాదగిరి, పిల్లి హరిచంద్ర, ఎస్కే ఆలీ, రాష్ట్ర ప్రచార కార్యదర్శి పిల్లి సూర్యం, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దండి కొమురయ్య, మోటం సారయ్య, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు సూర వెంకటయ్య, వివిధ జిల్లాల అధ్యక్షులు వాతల యాదగిరి, మూలవీర నరసింహ, నర బిక్షపతి, చొక్కాపురం శ్రీరాములు, మీసం సెమోన్, నారాయణ, తోట లక్ష్మణ్, జేరిపోతుల బిక్షపతి,అంకిరెడ్డిపల్లి నర్సింలు, మల్లేశం సూరయ్య తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ వేతనాలు చెల్లించాలి

### సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి దేవేందర్



**చేవెళ్ళ సెప్టెంబర్ 07(నినాదం):** గ్రామపంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ అన్నారు. చేవెళ్ల నియోజకవర్గం షాబాద్ మండలం నాగర్ గూడ గ్రామం లోని పీఎస్ఆర్ గార్డెన్లోఈ నెల 16 తెలంగాణ గ్రామపంచాయతీ వర్కర్స్ అండ్ యూనియన్ జిల్లా మహాసభ నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి అలీ దేవేందర్ మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికులకు గత రెండు నెలలుగా వేతనాలు రాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వెంటనే గ్రామపంచాయతీ కార్మికుల వేతనాలు విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు అదేవిధంగా గ్రామపంచాయతీ కార్మికులు మున్సిపల్ కార్మికులు ఒకే రకమైన పని విధానం అయినప్పటికీ గ్రామపంచాయతీ కార్మికులకు మున్సిపల్ కార్మికులతో సమానంగా ప్రభుత్వం వేతనాలు చెల్లించడం లేదని ఇది సరైనది కాదన్నారు. గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలపై ఈ నెల 16 వ తారీఖున జరిగే జిల్లా మహాసభలో ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని అన్నారు శంకర్పల్లి మండలంలోని గ్రామపంచాయతీ కార్మికులు పెద్ద సంఖ్యలో జిల్లా మహాసభలలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ యూనియన్ సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కోనాపురం నర్సింలు శంకర్పల్లి మండల నాయకులు లేగల మల్లేష్, నక్క మల్లేష్,నక్క యాదయ్య,పశువుల మల్లేష్,అమృత, రేఖ తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్లు వెంటనే కేటాయించాలి

### ప్రభుత్వ స్థలాలు, డబల్ బెడ్ రూమ్ ఇండ్లు ఆక్రమిస్తాం

### సిపిఎం కుతుబుల్లాపూర్ మండల కార్యదర్శి కీలు కాని లక్ష్మణ్



**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 7 (నినాదం):** సిఐటియు కుత్బుల్లాపూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో షాపూర్ నగర్ కార్యాలయంలో పారిశ్రామిక ప్రాంత లోడింగ్, అన్ లోడింగ్ హమాలీ కార్మికుల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సిపిఎం కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ పాల్గొని మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో 60 లక్షల మంది అసంఘటిత రంగ కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. వీరు ఎలాంటి రక్షణ చట్టాలు, హక్కులు లేకుండా పనిచేస్తున్నారని వారికి కనీసం ఉండడానికి ఇల్లు లేక వేల రూపాయలు అద్దెలు చెల్లిస్తూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు కాక రాజకీయ పార్టీల ఎన్నికల వాగ్దానాల మేరకు ప్రభుత్వాలు మారినప్పుడల్లా ఇల్లు కోసం, దరఖాస్తులు చేస్తూ ఏళ్ల తరబడి ఎదురు చూడటం తప్ప సొంత ఇంటి కల నెరవేరడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టిలో ఇచ్చిన 6 గ్యారంటీల అమలులో తీవ్రనిర్లక్ష్యం జరుగుతుందని గుర్తు చేశారు. కుత్బుల్లాపూర్ ప్రాంతంలో గత ప్రభుత్వం నిర్మించిన రెండు గదుల ఇండ్లు ఇప్పటికీ 18,000 ఎవరికి కేటాయించకుండా ఉన్నాయని వాటిని వెంటనే ఇల్లు లేని పేదలకు కేటాయించాలని లేనిపక్షంలో రెండు గదుల ఇళ్లను, ప్రభుత్వ భూములను ఇల్లు లేని పేదలతో ఆక్రమిస్తామని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు, కే, శ్రీనివాస్ డి,కరుణాకర్ ,పి అంజయ్య, నర్సింలు దుర్గ నాయక్ ,సాధులు తిమ్మప్ప, శ్రీశైలం, యాదవ రెడ్డి, కనకయ్య వీరేష్, భాష తదితరులు పాల్గొన్నారు.

## సంచార జాతుల విముక్తి దినోత్సవాన్ని విజయవంతం చేయండి

### సంచార జాతుల రాష్ట్ర అధ్యక్షులు తిప్పిరిశెట్టి శ్రీనివాస్



**నిజామాబాద్ ప్రతినిధి, సెప్టెంబర్ 7 (నినాదం) :** తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో తొలిసారిగా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన ఈ నెల 10వ తేదీన హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించే సంచార జాతుల విముక్త దినోత్సవానికి సంచార కులాల ప్రజలు అత్యధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని సంచార జాతుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు తిప్పిరిశెట్టి శ్రీనివాస్ అన్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో సంచార జాతుల ప్రతినిధులతో ఆదివారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం సంచార విముక్త జాతుల దినోత్సవ వేడుకల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో 52సంచార కులాలు ఎటువంటి సామాజిక, విద్య, ఉపాధి మరియు రాజకీయ అవకాశాలకు దూరంగా జీవిస్తున్నాయని అన్నారు. దశాబ్దాలుగా సంచార జాతి ప్రతినిధులు చేస్తున్న పోరాటాలకు స్పందించి రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా సంచార విముక్త జాతుల దినోత్సవాన్ని ఈనెల 10వ తేదీన హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహిస్తున్నారని ఈ సమావేశానికి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తో పాటు పలువురు మంత్రులు హాజరుకానున్నారని కాబట్టి ఈ కార్యక్రమానికి సంచార కులాల ప్రజలు అత్యధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి పల్లపు సమ్మయ్య, వడ్డెర కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ద్యారంగుల నగేష్, ఓడ్ కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాదవ్ శరత్, వడ్డెర కుల సంఘం జిల్లా అధ్యక్షులు రాపాని నర్సింహులు, జిల్లా నాయకులు ముద్దంగుల గిరి, ర్యాపాల శ్రీనివాస్, దండుగుల గంగారం, ర్యాపాల వేణు కుమార్, బత్తుల శ్రీనివాస్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# నినాదం
## తెలంగాణ ప్రాంతీయం
నిఖార్సైన జర్నలిజం

సోమవారం, తెలంగాణ
7 సెప్టెంబర్ 2025


## ఇసుక ట్రాక్టర్లు పట్టుకున్న పోలీసులు

**భీమదేవరపల్లి సెప్టెంబర్ 7 (నినాదం):** అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ ను పట్టుకొని డ్రైవర్ పై కేసు నమోదు చేసిన పోలీసులు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం లోని ముల్కనూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు ఏ రకమైన అనుమతులు లేకుండా ఇసుక ట్రాక్టర్లు పట్టుకుని పోలీస్ స్టేషన్కు తీసుకువచ్చి డ్రైవర్ పల్లపు సాంబరాజు పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం రాజు తెలిపారు.

## దమ్మపేటలో ప్రజా ప్రెస్ క్లబ్ సభ్యుల సమావేశం...



**దమ్మపేట, సెప్టెంబర్ 7(నినాదం):** మండల కేంద్రంలోని ప్రజా ప్రెస్ క్లబ్ కార్యాలయంలో చైర్మన్ షేక్ దస్తగిర్ అధ్యక్షతన సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు అంశాలపై క్లబ్ సభ్యులతో చర్చించారు. అనంతరం నూతనంగా కొంతమంది మీడియా మిత్రులను సాధరంగా ఆహ్వానిస్తూ క్లబ్ లో సభ్యులు గా చేర్చుకొనుట జరిగింది. ఈ సందర్భంగా క్లబ్ యొక్క నియమ నిబంధనలను వారికి వివరించారు. ఈ సమావేశం లో క్లబ్ సెక్రటరీ బజ్జూరి శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ మేకల ఉపేంద్ర, కోశాధికారి బొబ్బిలి రాకేష్, ప్రచార కార్యదర్శి ఎండీ సాలర్, షేక్ ఖాసీం, నూతన సభ్యులు, ఆనంద్, అన్నవరపు నాగేంద్ర, సిహెచ్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## చలో కలెక్టరేట్ ను విజయవంతం చేయండి

## ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్చార్జ్ మాట్ల వెంకటస్వామి



**భీమదేవరపల్లి సెప్టెంబర్ 7 (నినాదం):** ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ పిలుపుమేరకు వృద్ధులు వికలాంగుల వితంతువుల పెన్షన్ల పెంపునకై చేపట్టిన చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని హుస్నాబాద్ నియోజకవర్గ ఇన్చార్జి మాట్ల వెంకటస్వామి పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు వికలాంగులకు, వృద్ధులకు వితంతువులకు పెన్షన్ల పెంపును వెంటనే అమలు చేయాలని ప్రభుత్వం పై ఒత్తిడిలో భాగంగా నేడు జరిగే చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాలు వికలాంగుల హక్కుల సంఘం సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## కందుకూర్ మండల రైతు సోదరులందరికీ ముఖ్య ప్రకటన

**మహేశ్వరం సెప్టెంబర్ 7 (నినాదం న్యూస్) :** యూరియా బస్తాల పంపిణీకి సంబంధించి లికొన్ని సాంకేతిక కారణాల వలన రేపు మన మండల కేంద్రంలోని పంపిణీ కేంద్రం అయినా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (సొసైటీ ఆఫీస్) నకు యూరియా బస్తాల లారీ వాహనం లోడు రావట్లేదులి అని తెలియజేస్తున్నాము తదుపరి యూరియా బస్తాల వాహనం లోడు ఏరోజు వస్తుందో మీకు ఒకరోజు ముందుగానే విలేజ్ గ్రూపులలో తెలియపరచి టోకెన్ నెంబర్ (క్రమసంఖ్య) వారీగా యూరియా బస్తాల పంపిణీ సజావుగా జరిగేటట్టు చర్యలు తీసుకుంటాము కావున రైతు సోదరులందరూ ఇట్టి విషయాన్ని గమనించి సహకరించగలరని మనవిమండల వ్యవసాయ శాఖ కందుకూరు మండలం అధికారులు సిబ్బంది ఒక ప్రకటనలో తెలియజేశారు.

### డ్రగ్స్ మాఫియా అరికట్టడంలో

# నిషా వైఫల్యం

**చర్లపల్లిలో పట్టుబడినవారిపై**
**ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి**
సిపిఎం మేడ్చల్ జిల్లా కార్యదర్శి పి.సత్యం



**మేడ్చల్ మల్కాజిగిరి ప్రతినిధి, సెప్టెంబర్7,(నినాదం):** డ్రగ్స్ మాఫియాను అరికట్టాలని, చర్లపల్లి పట్టుబడిన డ్రగ్స్ తయారీదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఎం మేడ్చల్ జిల్లా కార్యదర్శి పి.సత్యం డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా డ్రగ్స్ సరఫరా చేస్తున్న భారీ నెట్వర్క్ మూలాలు చర్లపల్లిలోని ఓ పరిశ్రమలో మెఫిడ్రిన్ మత్తు పదార్థం తయారు చేస్తున్న ఇద్దరిని మహారాష్ట్ర పోలీసులు అరెస్టు చేసి, పరిశ్రమలో 5.96 కిలోల మెఫిడ్రిన్, 35,500 లీటర్ల రసాయనాలు, 950 కిలోల ముడిసరుకు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన వెలుగులోకి రావడంతో ఆదివారం చర్లపల్లి పారిశ్రామిక వాడలోని ఆ పరిశ్రమ ముందు సిపిఎం మేడ్చల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి పి. సత్యం మాట్లాడుతూ.. మహారాష్ట్ర పోలీసులు అరెస్టు చేసిన ఒక యువతి ద్వారా చర్లపల్లి పారిశ్రామిక వాడలో డ్రగ్స్ ఉత్పత్తి జరుగుతుందని తెలియడం తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యే విషయం అన్నారు. ఇన్స్పెక్టర్ ఆఫ్ పరిశ్రమల అధికారుల తనిఖీలు లేకపోవడం వల్ల పారిశ్రామలలో ఇలాంటి ప్రమాదకర డ్రగ్స్ ఉత్పత్తి జరుగుతుందని ఆయన తెలిపారు. రాష్ట్ర నిషా వర్గాల వైఫల్యం బహిర్గతమైందని సిపిఎం మేడ్చల్ జిల్లా కార్యదర్శి పి.సత్యం విమర్శించారు. మన రాష్ట్ర నిషా వర్గాల లోపాన్ని ప్రభుత్వం సీరియస్గా తీసుకోవాలని అన్నారు. రేవ్ పార్టీలు, డ్రగ్స్ పంపిణీ పై ఉక్కు పాదం మోపే రేవంత్ రెడ్డి ప్రభుత్వం మన రాష్ట్రంలో లో జరిగే డ్రగ్స్ ఉత్పత్తిని అరికట్టడానికి అంతకంటే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి గతంలో ప్రాతినిధ్యం వహించిన మల్కాజిగిరి పార్లమెంటు నియోజకవర్గంలో డ్రగ్స్ ఉత్పత్తి జరుగుతుండగా ఈడ్రగ్స్ వ్యాప్తిని అరికట్టేందుకు ప్రభుత్వం వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలి డిమాండ్ చేశారు. ప్రైవేటు వెంచర్స్ లో, రెసిడెన్షియల్ ఏరియాలో నడుస్తున్న పారిశ్రామలలో నిరంతరం తనిఖీలు చేయాలని కోరారు. కెమికల్, ఫార్మా మరియు అన్ని డ్రగ్స్ పరిశ్రమలో స్పెషల్ డ్రైవ్ తో తనిఖీలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కోమటి రవి మాట్లాడుతూ.. డ్రగ్స్ వ్యతిరేకంగా ప్రభుత్వం గంభీరంగా వ్యవహరించాలి. యువత భవిష్యత్ను నాశనం చేస్తున్న ఈ మాఫియాను కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.శ్రీనివాసులు, జిల్లా కమిటీ సభ్యులు గుంటి లక్ష్మణ్, సీనియర్ నాయకులు సిహెచ్ వరప్రసాద్, జగ్గరాజు, జి.వెంకటేశ్వరరావు, ఎం.శ్రీనివాసరావు, గణేష్, శరత్, విజయ్ కుమార్, 3డి ఫోమ్ కట్ పరిశ్రమ ప్రధాన కార్యదర్శి ఆదాం కృష్ణారెడ్డి, కంపెనీ కార్మికులు, ఈసీ నగర్ అసోసియేషన్ నాయకులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# క్యారెక్టర్ ఆర్టిస్ట్ జయప్రకాశ్ రెడ్డి

## సెప్టెంబర్ 8... జయప్రకాశ్ రెడ్డి వర్ధంతి



జయప్రకాశ్ రెడ్డి తెలుగు నటుడు. రాయలసీమ యాసలో ఆయన చెప్పే సంభాషణలు ప్రసిద్ధి. ఈయన ఎక్కువగా ప్రతినాయక, హాస్య పాత్రలను పోషిస్తుండే వాడు.

1946 మే 8 న కర్నూలు జిల్లా, ఆళ్ళగడ్డ మండలంలోని శిరువెళ్ళ గ్రామంలోని వ్యవసాయ కుటుంబంలో జన్మించాడు. తండ్రి సాంబిరెడ్డి సబ్ ఇన్‌స్పెక్టర్ గా పనిచేసే వాడు. నెల్లూరు లోని పత్తేకాన్ పేటలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో 1 నుండి 5వ తరగతి వరకు చదివాడు. తర్వాత నెల్లూరులోని రంగనాయకుల పేట లోని ఉన్నత పాఠశాలలో చేరాడు. పదో తరగతిలో ఉండగా తండ్రికి అనంతపురం బదిలీ అయ్యింది. అక్కడ సాయిబాబా నేషనల్ హయ్యర్ సెకండరీ స్కూల్లో ఎస్ఎస్ఎల్‌సీలో చేరాడు. చిన్నప్పటి నుంచే నాటకాలంటే ఆసక్తి ఉండేది. తండ్రి కూడా నటుడే అయినందున, ఇంట్లో కుటుంబ సభ్యులు కూడా అందుకు అడ్డు చెప్పేవారు కాదు. తండ్రీ కొడుకులు కలిసి కూడా నాటకాల్లో నటించారు. చదువులోనూ ముందుండే వాడు. డిగ్రీ తర్వాత ఉపాధ్యాయ శిక్షణ పూర్తి చేసుకుని గణితం ఉపాధ్యాయుడిగా ఉద్యోగంలో చేరాడు. అనంతపురం లోని పాఠశాలలో చదివేటపుడు అక్కడి టీచర్లందరూ ఆచార్యులే. గుండాచారి అని సైన్స్ టీచర్ కల్చరల్ యాక్టివిటీస్‌కి హెడ్‌గా పని చేసేవారు. కళలపై ఆయనకున్న అభిమానం ఇతనిపై చాలా పని చేసింది. ఒకరోజు ఆయన, స్నేహితుడు 'దుర్యోధన గర్వ భంగం' అనే నాటికలో పద్యాలు, డైలాగులు బట్టీ కొట్టేసి ఆయన దగ్గరకెళ్లి టపటపా అప్ప చెప్పాడు. ఎక్కడ తేడా వచ్చిందో తెలీదు. ఆయన చాలా కోపంగా 'మళ్లీ నాటకాల పేరెత్తితే తన్నేస్తాను వెధవల్లారా' అంటూ అరిచాడు. ఆయన స్నేహితుడు లైట్‌గా తీసుకున్నాడు గానీ.. జయప్రకాష్ మాత్రం చాలా ఫీలయ్యాడు. మూడురోజులు బెంగ పెట్టు కున్నాడు. ఆ బాధ, కసి కారణంగానే నటనను వృత్తిగా స్వీకరించాలని ధృఢ నిర్ణయం తీసుకున్నాడు. ఒకసారి జయ ప్రకాష్ రెడ్డి నల్గొండలో గప్ చుప్ అనే నాటకాన్ని ప్రదర్శిస్తుండగా దాసరి నారాయణరావుకు ఆయన నటన నచ్చి, నిర్మాత రామా నాయుడుకు పరిచయం చేశాడు. అలా ఈయన 1988లో విడుదలైన "బ్రహ్మపుత్రుడు" చిత్రంతో తెలుగు సినీరంగానికి పరిచయ మయ్యాడు. అయితే 1997 లో విడుదలైన "ప్రేమించుకుందాం రా" చిత్రం ప్రతి నాయకునిగా మంచి పేరు తీసుకుని వచ్చింది. తరువాత బాలకృష్ణ కథా నాయకుడిగా వచ్చిన సమరసింహా రెడ్డి, నరసింహ నాయుడు లాంటి విజయవంతమైన సినిమాల్లో కూడా ఇలాంటి పాత్రతోనే ప్రేక్షకులను మెప్పించాడు. వరల్డ్ ఫేమస్ లవర్ (2020)బీ సిల్లీ ఫెలోస్ (2018)బీ అమర్ అక్బర్ ఆంటోని (2018)"బీ విజేత (2018)బీ ఎమ్ఎల్ఏ (2018)బీ నేనే రాజు నేనే మంత్రి (2017)బీ రాధ (2017)బీ హెడ్ కానిస్టేబుల్ వెంకట్రామయ్య (2017)బీ సుప్రీమ్ (2016)బీ ఇంట్లో దెయ్యం నాకేం భయం (2016)బీ మీలో ఎవరు కోటీశ్వరుడు (2016)బీ పండగ చేస్కో (2015)బీ జేమ్స్ బాండ్ (2015)బీ సౌఖ్యం (2015)బీ ప్రతినిధి (2014)బీ గలాట (2014)బీ జంప్ జిలాని (2014)బీ ఎదురులేని అలెగ్జాండర్ (2014)బీ షాడో (2013)బీ అడ్డా (2013)బీ నిప్పు (2012)బీ దేవరాయ (2012)బీ ప్రస్థానం (2010)బీ బ్రహ్మలోకం టు యమలోకం వయా భూలోకం (2010)బీ ఆలస్యం అమృతం (2010)బీ కిక్ (2009)బీ కింగ్ (2008)బీ రెడీ (2008)బీ ఆట (2007)బీ విక్రమార్కుడు (2006)బీ ఛత్రపతి (2005)బీ ఎవడిగోల వాడిదే (2005)బీ ఎంజాయ్ (2004)బీ కబడ్డీ కబడ్డీబీ ఆయుధం (2003)బీ చెన్న కేశవరెడ్డి (2002)బీ లాహిరి లాహిరి లాహిరిలో (2002)బీ నరసింహ నాయుడుబీ అల్లరి రాముడు (2002)బీ ఆనందంబీ అడవి చుక్క (2000)బీ ప్రేమించు కుందాం రా (1997)బీ నీకోసం (1999)బీ చిత్రం భళారే విచిత్రం (1992)బీ బ్రహ్మ పుత్రుడు (1988) (తొలి చిత్రం) లలో విభిన్న పాత్రలు ఆయనకు పేరు తెచ్చి పెట్టాయి. గత ఏడాది సెప్టెంబర్ 8న జయప్రకాష్ రెడ్డి ఆకస్మిక మరణంతో తెలుగు సినిమా లోకం ఒక విలక్షణ నటుడిని కోల్పోయింది. ధర్మపురి క్షేత్రస్త శ్రీ లక్ష్మి నరసింహ నాట్య మండలి ఆధ్వర్యంలో హైదరాబాద్లోని రవీంద్ర భారతిలో 2016 మార్చి 5న ప్రదర్శించిన వీర పాండ్య కట్ట బొమ్మన చారిత్రక నాటకాన్ని ఆసాంతం చూసిన జయప్రకాష్ రెడ్డి, నాటకం అయినాక స్టేజీ పైకి వెళ్ళి, తనూ ఈ నాటకంలో చాలా సార్లు ఎట్టప్ప విలన్ పాత్రలో నటించానని, ప్రేక్షకులకు వివరించి కట్ట బొమ్మన నాటకంలోని కళాకారులను ఒక్కొక్కరిని అభినందించిన నేపథ్యాన్ని కళాకారులు ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.

రామ కిష్టయ్య సంగన భట్ల...
9440595494

# కళారంగ ఘనాపాఠి గరికపాటి

## సెప్టెంబర్ 8...గరికపాటి రాజారావు వర్ధంతి

కళలు సామాజిక ప్రగతికి దోహదం చెయ్యాలని, జనాన్ని చైతన్య స్పూర్తితో ముందుకు నడిపించాలని, అందుకు కళలు కరదీపికలు కావాలని ప్రతికరణ శుద్ధిగా నమ్మి ఆ లక్ష్య సాధనకు జీవితాన్ని అంకితం చేసిన మహోన్నత వ్యక్తి గరికపాటి రాజారావు. కళ ప్రజాచైతన్యం కోసమేనని నమ్మి, జీవితాన్ని కళకే అంకితం చేసిన ప్రజా కళాకారుడు, ప్రజావైద్యుడు రాజారావు.

నాటకరంగం ద్వారా ప్రజాకళా రంగానికి దిక్సూచిగా నిలచిన వైతాళికుడు డాక్టర్ గరికపాటి రాజారావు. తెలుగు నాటక రంగంలో అతి నవీన భావాలతో వినూత్న విలువలను ఆవిష్కరించి తెలుగు నాటక దశను, దిశను మార్చి సామాన్య ప్రజల సాంస్కృతిక సైనికుడిలా నిలచిన కళాస్రష్ట ఆయన. ప్రముఖ నటీనటులు జమున, అల్లు రామలింగయ్యను వెండితెరకు పరిచయం చేసిన ఘనత ఆయనదే.

గరికపాటి రాజారావు (ఫిబ్రవరి 5, 1915 – సెప్టెంబరు 8, 1963) తెలుగు సినిమా దర్శకుడు, నాటకరంగ ప్రముఖుడు, ఆంధ్ర ప్రజానాట్య మండలి వ్యవస్థాపకులు. ప్రజానాట్య మండలి సాంఘిక నాటకాలకు పెద్దపీట వేసింది. ఈ నాటక సంఘం ద్వారా అనేకమంది ప్రతిభా వంతమైన కళాకారులు పరిచమయ్యారు. చెప్పికోదగిన వారిలో దేవిక, అల్లు రామ లింగయ్య, సంగీత దర్శకులు మోహన్ దాస్, టి.చలపతిరావులు, నృత్యదర్శకుడు వేణుగోపాల్, రచయితలు సుంకర సత్య నారాయణ, వాసిరెడ్డి భాస్కరరావు, బుర్రకథ కళాకారుడు షేక్ నాజర్ ఉన్నారు.

రాజారావు 1915 ఫిబ్రవరి 5వ తేదీన రాజమండ్రిలో గరికపాటి కోటయ్య, దేవరా రామలింగమ్మల దంపతులకు జన్మించారు. చిన్నప్పుడే కాకినాడలోని ఆదిభట్ల నారాయణదాసు హరికథకు వెళ్లి, పాటకు తగిన తాళం వేసి తన ప్రతిభను నిరూపించుకుని అభినందనలు పొందారు. చదువు కుంటున్న రోజుల్లో విచిత్ర వేషధారణలో ఆసక్తి చూపించిన రాజారావు, హరిశ్చంద్ర నాటకం లోనూ ఓ వేషం ధరించి పాఠశాల అధ్యాపకుల మెప్పు పొందారు. తరువాత విజయ నగరంలో మేనమామ సుబ్రహ్మణ్యం ఇంట చేరి ఎస్ఎస్ఎల్సి పూర్తి చేశారు. రాజారావుకు 15వ ఏటనే నాగేశ్వరమ్మతో వివాహం జరిగింది. తండ్రి ఉద్యోగం చేసిన సికిందరా బాదు లాలాగూడ వర్క్‌షాపులో చిన్న గుమాస్తాగా జీవనం సాగిస్తూ, పై ఉద్యోగి పీడన భరించలేక దానికి రాజీనామా చేసి 1937లో మద్రాసు చేరారు. మద్రాసులో ఎల్.ఐ.యం చదువుతున్న రోజులో పుచ్చలపల్లి రామచంద్రారెడ్డి (పుచ్చలపల్లి సుందరయ్య సోదరుడు) డాక్టర్ రామదాసు ఆయనకు ప్రాణ స్నేహితులు. అలాంటి స్నేహ వాతావరణ ప్రభావం వలన రాజారావు మార్క్సిస్టు రాజకీయ ఉద్యమాలవైపు ఆకర్షితులయ్యారు.

మద్రాసలో చదువుతున్నప్పుడే సహ విద్యార్థులతో కలిసి గుళ్లపల్లి నారాయణ మూర్తి రచించిన విడాకులు నాటకానికి దర్శకత్వం వహించాడు. మద్రాసులో రాజారావు దర్శకత్వంలో ప్రదర్శించిన షాజహాన్ నాటకం సంచలనాన్ని సృష్టించింది. షాజహాన్‌గా ఎస్వీఆర్ సాంబశివరావు, జహనారాగా డాక్టర్ కొర్రపాటి గంగాధరరావు, ఔరంగజేబుగా రాజారావు అద్భుతంగా నటించి పలువురి ప్రశంసలు పొందారు. ఆ నాటకంలో రాజారావుకు సుప్రసిద్ధ



నటుడు రూపశిల్పి దేవీప్రసాద్ రాయ్ చౌదరి మేకప్ చేయడం విశేషం. మద్రాసులో విద్యార్థులను సమీకరించి భమిడిపాటి బాగుబాగు, గాలి బాల సుందరరావు అపోహ వంటి నాటకాలను ప్రదర్శించారు.

వృత్తి రీత్యా వైద్యుడైన రాజారావు ఉచితంగా వైద్య సేవలు అందించడానికి విజయవాడలోని పోరంకిలో ప్రజా వైద్యశాల నెలకొల్పి ఫీజులు తీసుకోకుండా మందులు కూడా తనే కొనుగోలు చేసి ఉచితంగా రోగులకు సేవ చేసేవారు. కొంతకాలం రాజమండ్రి లోనూ ప్రజావైద్యశాల నిర్వహించారు.

రాజారావు 1953లో పుట్టిల్లు సినిమాను స్వయంగా నిర్మించి దర్శకత్వం వహించారు. ఈ సినిమాలో ప్రముఖ నటీనటులు జమున, అల్లు రామలింగయ్యను వెండితెరకు పరిచయం చేశారు. పుట్టిల్లు సినిమాలో వివిధ నటులు తమ నటనకు ప్రశంసలందుకున్నా ఈ సినిమా ఆర్థికంగా లాభించ లేదు. దానితో రాజారావు ఆర్థికంగా దెబ్బతిని అప్పుల పాలయ్యారు. కానీ వృత్తిరీత్యా వైద్యుడైన రాజారావు సంఘసేవ మాత్రం ఆపలేదు. ఒక్క రూపాయికి వైద్యం చేసిన సేవా తత్పరులు. పేదవారికి ఉచితం వైద్యం చేస్తుండేవారు.

ఆ తరువాత ఈయన 1962లో విడుదలైన ఆరాధన వంటి సినిమాల్లో చిన్నాచితక పాత్రలు కూడా పోషించారు. ఆరాధనలో రాజశ్రీకి తండ్రి షావుకారు పాత్ర వేశారు. జైభవానీ నాటకాన్ని ప్రదర్శించే సమయంలో గుండెపోటు రావడంతో తీవ్ర అస్వస్థులయ్యారు. అదే సమయంలో దేవుడుచేసిన మేలు చిత్రాన్ని నిర్మించినా ఆర్థిక కారణాలవల్ల ఆ చిత్రం విడుదల కాలేదు. మానసికంగా కుంగిపోయిన రాజారావు 1963 సెప్టెంబరు 8న మద్రాసులో మరణించారు.

రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

# సినీ సంగీత సామ్రాజ్య మకుట రహిత "చక్రవర్తి"

## సెప్టెంబర్ 8 చక్రవర్తి జయంతి

తెలుగు చలన చిత్ర రంగంలో విడదీయరాని బంధం అనుబంధం కలిగి ఉన్న బహుముఖ ప్రజ్ఞాశాలి సంగీత దర్శకులు చక్రవర్తి. 950కి పైగా చలన చిత్రాలకు సంగీతాన్ని అందించిన చక్రవర్తి తెలుగు చలన చిత్ర రంగములో ప్రముఖ స్వరకర్తగా, 1971 నుంచి 1989 వరకు రంగములో మకుటంలేని మహారాజుగా వెలిగారు.

చక్రవర్తి గుంటూరు జిల్లా, తాడికొండ మండలం, పొన్నెకల్లులో 1936 సెప్టెంబరు 8వ తేదీన జన్మించిన చక్రవర్తి అసలు పేరు కొమ్మినేని అప్పారావు. ఆయన తల్లిదండ్రులు సంగీత జ్ఞాన సంపన్నులు. అలా ఆయనకు సంగీతంపై ఆసక్తికి నేపథ్యం ఉంది. కుమారుని ఉత్సాహంచూసి తండ్రి గుంటూరులో ఉన్న మహావాది వెంకటప్పయ్య శాస్త్రి దగ్గర సంగీతం నేర్పించారు. ఒక పక్క చదువు, మరో పక్క సంగీతా భ్యాసం నిరాటంకం గానే సాగాయి. అయన ఉత్సాహం దాచుకోలేక వినోద్ ఆర్కెస్ట్రా అనే బృందాన్ని ఏర్పాటు చేసి పాటలు, పద్యాలు పాడుతూ ప్రదర్శనలు ఇచ్చేవారు. విజయవాడ ఆల్ ఇండియా రేడియోలో 1954–58ల మధ్య కె.అప్పారావు కంఠం పాటలతో ప్రతిధ్వనించేది. నాటి శ్రోతలకి అతని కంఠం బాగా సుపరిచితమే.

అప్పారావు మద్రాసు వచ్చి హెచ్.ఎమ్.వి. వారికి గ్రామఫోను పాటలు పాడటం ప్రారంభించారు. ఒక రికార్డింగులో సంగీత దర్శకులు రాజన్, నాగేంద్రలు అవకాశం ఇప్పించి పాడించారు. బి.విఠలాచార్య ఆపారావుతో తన సినిమా జయ విజయ (1959)లో ఆడాలి ... పెళ్ళాడాలి అనే పాటను పాడించారు. ఆ పాటను చిత్రంలో హాస్యనటుడు బాలకృష్ణ పాడతాడు. ఇదే అప్పారావు సినిమాలలో పాడిన మొదటి పాట. గాయకుడిగా కెరీర్ ప్రారంభించారు. అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేశారు. డబ్బింగ్ ఆర్టిస్టుగానూ 500 చిత్రాలకు గాత్రం అందించారు. నటుడిగా తేనెటీగ, రాజా తదితర చిత్రాల్లో కనిపించారు. డైలీ సీరియల్స్‌లోనూ ఉదాత్తమైన పాత్రలు పోషించారు. కొన్ని చిత్రాలకు పాటలూ రాశారు. ఫలోమా అనే మలయాళ చిత్రం హిందీ డబ్బింగుకి వచ్చింది, దానికి అప్పారావుని సంగీత దర్శకునిగా తీసుకున్నారు. టైటిల్స్‌లో అన్నీ హిందీ పేర్లే ఉన్నాయి, వాటి మధ్య అప్పారావు అనే తెలుగు పేరు ఎందుకని సినిమావారు అతనుకు చెప్పి "చక్రవర్తి"గా వేశారు. అలా చక్రవర్తి అయి పోయారు. ఆ కాలంలో అనువాద చిత్రాలు ఎక్కువగా ఉండేవి, అందులో అప్పారావుకి అవాకాశాలు వచ్చాయి. నాటకాలలో అనుభవం ఉండడం చేత ఆయన సంభాషణలను బాగా చెప్ప గలిగారు. ఇలా అప్పారావు పాటలు పాడడంతో పాటు అనువాద చిత్రాలలో పాత్రలకు గాత్రం అందించటం మొదలు పెట్టారు. కంఠం, చెప్పే విధానం బాగా ఉండడంతో హీరో పాత్రలకు గొంతు దానం చేసే స్థాయికి ఎదిగారు. అలా జయ శంకర్, ఎం.జి.రామచంద్రన్, జెమిని గణేశన్ లకు గాత్రం అందించారు. హాస్యనటులైన నగేష్, కులదైవం రాజగోపాల్ లకూ డబ్బింగ్ చెప్పారు. ముఖ్యంగా నగేష్ కు బాగా డబ్బింగు చెప్పేవారు. అప్పారావు సినిమాలలో 200లకు పైగా పాటలు పాడారు.



కొన్ని కలిసి పాడినవి ఐతే, కొన్ని యుగళ గీతాలు. పరమానందయ్య శిష్యుల కథ (1966)లో ఘంటసాలతో "పరమగురుడు చెప్పిన వాడు పెద్దమనిషి కాదురా" అనే పాటను పాడారు. బంగారు సంకెళ్ళు (1968)లో రాజబాబుకి "తొలగండెహే" అనే తాగుడు పాటని పాడారు. నిలువు దోపిడి (1968)లో ఎన్.టి.రామారావుకు ఒక పద్యం చదివినప్పుడు, నాగార్జున పద్యాలు, శ్లోకాలు చదివినప్పుడు అందరూ మెచ్చుకున్నారు.

దర్శకుడు సి.ఎస్.రావు దగ్గర సహాయ దర్శకుడిగా చేరి నిలువు దోపిడి, మళ్ళీపెళ్ళి, కంచుకోట, పెత్తందార్లు సినిమాలకు పని చేశారు. అయితే తమకు ఇష్టమైన సంగీతాన్ని విడిచి పెట్టక పాటలూ పాడేవారు. శారద చిత్రంతో సినీ రంగంలో స్థిరపడ్డారు. అక్కినేని నాగేశ్వరరావుతో ప్రేమాభిషేకం,ఎన్.టి.రామారావుతో కొండవీటి సింహం వంటి విజయ వంతమైన చిత్రాలకు సంగీత దర్శకులుగా వ్యవహరించి 850కు పైగా తెలుగు చిత్రాలకు సంగీతాన్ని అందిచారు. చక్రవర్తి కొన్ని చిత్రాలలో కూడా నటించారు. చివరి సారిగా నిన్నే ప్రేమిస్తా చిత్రంలో సౌందర్య నాన్నగారిగా నటించారు. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల సినిమాలన్నీ కలుపుకుంటే –959 చిత్రాలు. ఆయన 'ట్రాక్' రికార్డు గురించి చెప్పకోవాలంటే – కన్నడ (60), తమిళం (4), మలయాళం (1) –ఒకే ఏడాదిలో 69 చిత్రాలకు సంగీతాన్ని అందించిన పాటల చక్రవర్తి అయన. అప్పారావు సినిమాల్లో 200లకు పైగా పాటలు పాడారు. తెలుగులో సంగీత దర్శకుడిగా 'మూగప్రేమ'తో కెరీర్ ప్రారంభించిన చక్రవర్తి –1997లో 'పెళ్లామా మజాకా' వరకూ సుస్వరాలు అందిస్తూనే ఉన్నారు.

అమ్మోరు చిత్రానికి చివరి సారిగా సంగీతాన్ని అందించిన చక్రవర్తి 2002 ఫిబ్రవరి 3న కన్ను మూశారు. ఆస్కార్ అవార్డు పొందిన ఏ.ఆర్.రెహమాన్ చక్రవర్తి శిష్యుడు కావడం విశేషం.

# ప్రపంచ ప్రగతి రథానికి శక్తివంతమైన ఇంధనం అక్షరాస్యతే !

## (08 సెప్టెంబర్ "అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం" సందర్భంగా)


అక్షరాస్యత ఒక ప్రధాన మౌలిక మానవ హక్కు. మన తలరాతను మనమే రాసుకోవడానికి అక్షర జ్ఞానం కావాలి. "ప్రపంచ ప్రగతి రథానికి శక్తివంతమైన ఇంధనం విద్య మాత్రమే" అని నెల్సన్ మండేలా అనడం మనకు గుర్తుంది. మనిషికి ధైర్యాన్ని, నైపుణ్య జ్ఞానాన్ని, అద్భుత గుణాన్ని, ఆకర్షణీయ వేతనాన్ని, సమాజంలో గౌరవాన్ని ఇవ్వగలిగేది, ఎవరూ దోచుకోలేని ఏకైక అదృశ్య నిధి అక్షరాస్యతతో కూడిన జ్ఞాన సంపదే. ఆలోచనాశక్తి, విశ్లేషణాత్మక యుక్తి, వ్యక్తిత్వ వికాస జ్యోతి అక్షరం నేర్పిన సుజ్ఞానమే. ప్రపంచ గుర్తింపును, ఎనలేని ఆత్మ విశ్వాసాన్ని నింపగలిగే సామర్థ్యం అక్షర జ్ఞానానికే ఉన్నది. మనిషిని మహా మనీషిగా, సామాన్యన్ని అసమాన్యుడిగా, సాధారణ వ్యక్తిని వివేకవంతుడిగా నిలుపగలిగే శక్తి ఒక్క అక్షరానికి మాత్రమే ఉంటుంది. పేదరిక నిర్మూలన, ఆరోగ్యకర కుటుంబ జీవనం, ఆనంద తోరణాల నీడలను ఇవ్వగలిగేది అక్షరం నేర్పిన జ్ఞానమే. నిరక్షరాస్యత ఉన్న సమాజంలో నిలువు దోపిడీ, శ్రమ దోపిడి, వెనుకబాటుతనం, అజ్ఞాన అంధకారం, అశాంతి మంటలు, రాక్షసుల కేరింతలు రాజ్యమేలుతాయి. ఒక వ్యక్తి బాధ్యతగా జీవించడానికి చదవడం, రాయడం, సంఖ్యా జ్ఞానం కనీసంగా అవసరం అవుతాయి.

అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం–2025 ఇతివృత్తం:

ప్రపంచాభివృద్ధిలో ప్రధాన అంశంగా అక్షర జ్ఞానం నిలుస్తున్నదని గుర్తించిన ఐరాస–యునెస్కో 1967 నుంచి ప్రతి ఏట 08 సెప్టెంబర్ రోజున "అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం (ఇంటర్నేషనల్ లిటరసీ డే)" పాటించడం ఆనవాయితీగా మారింది. అక్షరాస్యత పట్ల అవగాహన, అక్షరాస్యత అవసరం, అక్షరాస్యత అద్భుత ప్రయోజనాలను ప్రచారం చేయడానికి ఈ వేదికలు వినియోగపడుతున్నాయి. నాటి సాంప్రదాయ బోధనా పద్ధతుల నుంచి నేటి డిజిటల్ యుగపు సాంకేతికాభివృద్ధి బోధనల వరకు అనంత మార్పులు చోటుచేసుకున్నాయి. అక్షరాస్యత అంటే రాయగలగడం, చదువగలగవడం మాత్రమే కాదని, అక్షర జ్ఞానం అంటే స్వతంత్రంగా ఆలోచించగలగడం, మంచి చెవులను విశ్లేషించగలగడం, స్వయం నిర్ణయాలు తీసుకోగలగడం, సామాజిక మూఢ విశ్వాసాలను సరి చేసుకోగలగడం, వ్యక్తిగా ఎదగడం అని అర్థం చేసుకోవాలి. 2025 అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవ ఇతివృత్తంగా "డిజిటల్ యుగంలో అక్షరాస్యత ప్రోత్సాహం (ప్రమోటింగ్ లిటరసీ ఇన్ ది డిజిటల్ ఏరా)" అనే అంశాన్ని తీసుకొని డిజిటల్ సాంకేతికలను జోడించి అక్షర జ్ఞానాన్ని పెంచడం జరుగుతోంది. అనేక భాషలు మాట్లడే మానవాళి మధ్య భాషా అంతరాలను తగ్గిస్తూ, ప్రపంచవ్యాప్త అవగాహన కల్పిస్తూ, విశ్వ శాంతికి ఊతం ఇస్తూ, అక్షరాస్యతను పెంచడం ఒక సవాలుగా మారింది. నేడు సాధారణ అక్షరాస్యతతో పాటు డిజిటల్ అక్షరాస్యత కూడా కనీస అవసరం అవుతున్నది.

అక్షరాస్యతలో భారతం:

ప్రపంచవ్యాప్తంగా 739 మిలియన్ల యువత, వయోజనులు ఉన్నట్లు 2024 గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ప్రపంచ అక్షరాస్యత రేటు 86 శాతంగా నమోదు అయ్యింది. ప్రతి పది మందిలో నలుగురు పిల్లలు కనీసం రాయగలగడం లేదని, 272 మంది పిల్లలు, కౌమార యువత బడులకు దూరంగా ఉన్నారనే కఠోర వాస్తవాలు మనసులను కలచి వేస్తున్నాయి. 2023–24 గణాంకాల ప్రకారం భారత్‌లో 80 శాతం



వరకు అక్షరాస్యత రేటు నమోదు అయ్యింది. పాఠశాలలు నలుమూలలకు విస్తరించడం, మౌళిక సదుపాయాలు అందుబాటులోకి రావడం, ప్రజల్లో అవగాహన పెరగడం, మధ్యాహ్న భోజన పథకం అమలు, 14 ఏండ్ల వరకు ఉచిత నిర్భంధ విద్య చట్టం అమలు, ప్రభుత్వాలు నిధులను కేటాయించడం లాంటి అంశాలు అక్షరాస్యత రేటు పెరగడానికి ఉపయుక్తంగా ఉన్నాయి. నేడు పట్టణాలతో పోల్చితే గ్రామీణంలో అక్షరాస్యత రేటు తక్కువగా ఉండడం విచారకరం. గ్రామీణంలో 77.5 శాతం నమోదు కాగా పట్టణ ప్రాంతాల్లో 89 శాతం వరకు నమోదు అవుతున్నది. పట్టణాల్లో పాఠశాలల అందుబాటు, చక్రాల వసతులు, సాంకేతిక మౌళిక వనరులు, ఆర్థికంగా బలపడిన కుటుంబాలు, సుశిక్షితులైన టీచర్స్ ఉండడంతో అక్షరాస్యత రేటు అధికంగా నమోదు అవుతున్నది. నేడు సంప్రదాయ అక్షరాస్యతతో పాటు డిజిటల్ అక్షరాస్యతను కూడా నేర్పాల్సిన సమయం ఆసన్నం అయ్యింది, ఇదో సవాలుగా నిలువనుంది. భాషా అంతరాలను తగ్గించడం, సామాన్యప్రజను అక్షర జ్ఞానంలో శక్తివంతులుగా చేయడం, టెక్నాలజీని మనకు అనుకూలంగా మార్చుకోవడం, సామాజిక ఏకీకరణకు ప్రాధాన్యం ఇవ్వడం, అవగాహన పెంచడం, ఉద్యోగ ఉపాధులను కల్పించడం, సృజనకు పెద్ద పీట వేయడం, ఆవిష్కరణలకు పదును పెట్టడం, గ్రామీణులను జనజీవన స్రవంతిలోకి ఆహ్వానించడం లాంటివి అక్షర జ్ఞానంతో మాత్రమే సుసాధ్యం అవుతాయని తెలుసుకొని, మన వంతు బాధ్యతను నిర్వహిద్దాం.

డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037